క్లుప్తంగా

బాధితులకు పరామర్శ



పూల్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

పెద్దేముల్: మండలంలోని పాషాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు పూల్‌సింగ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి పూల్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను కలసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఓంమ్లానాయక్‌తండాలో మృతి చెందిన చెన్నానాయక్ కుటుంబాన్ని పరమర్శించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, నారాయణగౌడ్, ప్రకాశం, భరత్, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

కుల్కచర్ల: విద్యార్థులు వ్యక్తిగత స్వచ్ఛతను పాటిస్తూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారులు సురేశ్, జవహర్ పేర్కొన్నారు. ఎనిమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు వైద్యులు సూచిస్తున్న సలహాలను స్వీకరించి అనారోగ్య సమస్యలు ఎదురైతే అవసరమైన మాత్రలు వేసుకోవాలన్నారు. అదేవిధంగా భోజనం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుల్కచర్ల కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, చౌడాపూర్ ప్రత్యేకాధికారి జ్యోతి, వైద్య సిబ్బంది నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం ఎల్‌ఓసీ అందజేత



బాధితులకు ఎల్‌ఓసీ అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు: మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామానికి చెందిన పి.రత్నమ్మ అనారోగ్యానికి గురయ్యారు. ఆమెకు చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.1.25 లక్షల విలువ గల ఎల్‌ఓసీని సోమవారం కాంగ్రెస్ నేతలు అందజేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశానుసారం పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిలు రత్నమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



రైతుకు తక్‌పట్టీ అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

ధారూరు: మండలంలోని నాగసమందర్ పత్తి మిల్లులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ధారూరు ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. పత్తి రైతులను సతాయించరాదని, తేమశాతం ఎక్కువ ఉందనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేసే ప్రయత్నం మానుకోవాలని ఆయన సూచించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయరాదని ఆయన పేర్కొన్నారు. పత్తిమిల్లుకు తీసుకొచ్చి విక్రయించిన రైతులకు వెంటనే ఏఎంసీ చైర్మన్ తక్‌పట్టీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అశోక్ ముదిరాజ్, మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ, డైరెక్టర్ రాము, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

దోమ: మండల కేంద్రం నుంచి లింగస్‌పల్లి వెళ్లే ప్రధాన కంకరరోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలుగా మారింది. విషయాన్ని గ్రామస్తులు మండల నాయకుల దృష్టికి తీసుకెళ్లగా మాజీ ఎంపీపీ తనయుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాఘవేందర్‌రెడ్డి గుంతలలో మట్టిని వేయించేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం జేసీబీ సహాయంతో గుంతలుగా ఏర్పడిన ప్రాంతంలో పూడ్చి వేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక.. పనులు సాగక

- పిల్లర్ల దశలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- రోడ్డుపైనే పరిగి మార్కెట్ నిర్వహణ
- తీవ్ర అవస్థలు పడుతున్న స్థానికులు



పిల్లర్ల దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం

పరిగి: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయ భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. నిధుల లేమితో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూరగాయలు, చేపలు, మటన్, చికెన్... అన్నీ ఒకే చోట సమకూర్చాలని గత ప్రభుత్వం పరిగి కూరగాయ మార్కెట్‌ను విస్తృత పరచడానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2021లో భవన నిర్మాణానికి రూ.3.90 కోట్లతో పనులను అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. పనులు నత్తనడకన సాగడం, నిధులు లేమితో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పిల్లర్ల దశలోనే పనులు నిలిచి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఇదేమిటని ఆరా తీస్తే నిధులు విడుదల కాకపోవడమే ప్రధాన కారణమని చెబుతున్నారు. పరిగి మున్సిపాలిటీకి చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు నిత్యం సంతకు వస్తుంటారు. దీంతో ప్రజల అవసరాల నిమిత్తం అప్పటి ప్రభుత్వం సమీకృత వ్యవసాయ మార్కెట్ సముదాయాన్ని నిర్మించాలని సంకల్పించి పనులు ప్రారంభించింది. రెండు అంతస్తుల భవనం చిరు వ్యాపారులకు అందుబాటులో ఉంటుందని అనుకున్న రైతులకు, ప్రజలకు పనులు అర్ధాంతరంగా నిలవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిరాశలో ప్రజలు

పట్టణ కేంద్రంలోని మార్కెట్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టడంతో ప్రజలు, వ్యాపారస్తులు సంబురపడ్డారు. పనులు పిల్లర్ల వరకు శరవేగంగా నిర్వహించి నిలిపివేయడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. పనులు పూర్తయి ఒకే దగ్గర అన్ని దొరుకుతాయని అనుకుంటే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే దర్శనమిస్తున్నాయి. నిర్మాణానికి నిధులు కొరతతోనే పనులను మధ్యలో నిలిచిపోయాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులు ఇబ్బంది

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి కాకపోవడంతో కూరగాయల వ్యాపారస్తులు, రైతులు రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నారు. పట్టణ కేంద్రంలోని గంజ్ రోడ్డులో ప్రతి వారంలో శుక్రవారం, శనివారాల్లో సంత జరుగుతుంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంలో కూరగాయల సంతా ఏర్పాటు చేసేవారు.



రోడ్డుపై కూరగాయల సంత

కానీ ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులు ప్రారంభం అయినప్పటి నుంచి ప్రతి వారం రెండు రోజులు మార్కెట్‌ను గంజిరోడ్డుపైనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మొత్తం సంతతో నిండిపోతే ఇతర పనుల కోసం మార్కెట్‌కు వచ్చే వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులను త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం



దౌల్తాబాద్‌లో బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండల కేంద్రం నుంచి కోస్గికి ఆర్టీసీ బస్సును సోమవారం అధికారులు పునరుద్ధరించారు. ఈ బస్సు దౌల్తాబాద్ నుంచి కోస్గి మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లి తిరిగి మండల కేంద్రానికి వస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. స్థానిక నాయకులు బస్సుకు పూజలు చేశారు. బస్సును పునరుద్ధరించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, మహిపాల్, జగన్‌గౌడ్, పకీరప్ప, గోవిందు, శేఖర్ తదితరులున్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండల కేంద్రంలో కోస్గి డిపో ఇన్‌చార్జి మేనేజర్ బాలయ్య సోమవారం బస్సును ప్రారంభించారు. నిత్యం కోస్గి నుంచి దుద్యాల్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక ట్రిప్ నడుస్తుందని తెలిపారు. మొదటి సారిగా వచ్చిన బస్సులో గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ప్రయాణం చేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, వేణుగోపాల్, ఖాజా, వెంకటయ్య, ఖలీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

జాతరకు సహకరిస్తాం



చైర్‌పర్సన్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఆలయ ట్రస్టీ, ఈఓ

అనంతగిరి: కార్తీకమాసం పురస్కరించుకుని అనంతగిరి జాతర ఉత్సవాలకు సంబంధించి మున్సిపల్ తరఫున అన్ని విధాలా సహకరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం అనంతగిరి ఆలయ ఈఓ నరేందర్, ట్రస్టీ పద్మనాభం మున్సిపల్ చైర్‌పర్సన్‌కు జాతర ఆహ్వానపత్రాన్ని అందజేయడంతో పాటు జాతరకు సంబంధించిన అంశాలపై చర్చించారు. శానిటేషన్ నిర్వహణ, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆలయ ట్రస్టీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న ఉపాధ్యాయుడు మల్లేశ్ తదితరులు

దుద్యాల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే అని హస్నాబాద్ క్లస్టర్ జీహెచ్‌ఎం నర్సిములు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆలేడ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సన్మానం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండేవారు సమాజానికి ఎంతో వెలుగునిస్తారని, ఎంతో మంది విద్యార్థులను ఉన్నతమైన శక్తులుగా తీర్చి దిద్దుతారని ఆయన అన్నారు. పాఠశాలలో చాలా కాలంగా విధులు నిర్వహించిన హెచ్‌ఎం సిద్ధు మల్లేశ్, ఉపాధ్యాయుడు చంద్రకాంత్‌లు ఇటీవల బదిలీ అయ్యారు. వారికి గ్రామస్తులు సన్మానం ఏర్పాటు చేశారు. అనంతరం బదిలీ అయిన హెచ్‌ఎం విద్యార్థులకు ప్లేట్‌లు, గ్లాసులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గౌతమి, పంచాయతీ కార్యదర్శి రమేశ్ రాథోడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల అరెస్టు



దోమ: మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



పెద్దేముల్: మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

- అప్రజాస్వామికం అంటూ నేతల మండిపాటు
- రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం పిలుపుతో పోలీసుల అప్రమత్తం

తాండూరు రూరల్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో కరన్‌కోట్ పోలీసులు సోమవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు రాజప్పగౌడ్, అమృత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వడ్డె మదన్ మోహన్‌లతో పాటు నాయకులు ప్రభాకర్‌రెడ్డి, హేమంత్‌కుమార్ లను ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌ను తీసుకొచ్చారు. అనంతరం వ్యక్తిగత పూచీ కత్తుపై విడుదల చేసినట్లు ఏఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

దోమలో..

దోమ: పోలీసులు మాజీ సర్పంచులను అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని ఆ సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం పిలుపు మేరకు ఆయా గ్రామాల్లోని మాజీ సర్పంచులు తమ పెండింగ్ బిల్లులు రాలేదని హైదరాబాద్ నగరంలో ధర్నా చేసేందుకు వెళ్తుండగా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపడితే.. వాటి బిల్లులు నేటి రావడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కృష్ణ, అంజిలయ్య, కుంటరాములు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లకుండా కట్టడి

పెద్దేముల్: తమ హయాంలో చేపట్టిన పనులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ మాజీ సర్పంచ్‌ల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో ఆందోళన చేపట్టి ప్రభుత్వానికి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో మాజీ సర్పంచ్‌లు బలవంత్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశంతో పాటు తదితరులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ గిరి తెలియజేశారు.

బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడి హౌస్ అరెస్ట్

బంట్వారం: పెండింగ్ బిల్లుల చెల్లింపుల విషయమై మాజీ సర్పంచులు సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు, కరీంపూర్ మాజీ సర్పంచ్ సుందరి అనిల్‌ను పోలీసులు ముందస్తుగా హౌజ్ అరెస్ట్ చేశారు. అనిల్‌ను హైదరాబాద్ వెళ్లకుండా గృహంలో నిర్బంధించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమ అరెస్టులు చేయడం సరి కాదన్నారు.

ప్రజారోగ్యంపై చొరవ చూపండి

దోమ: వైద్యాధికారులు ప్రజల ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నూతన డీఎంహెచ్ఓ వెంకటరమణను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిబ్బందిని భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవరాజు పాల్గొన్నారు.

దాతృత్వ సేవలు అభినందనీయం

దోమ: విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని ఎంఈఓ వెంకట్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బ్రహ్మణపల్లి పెద్దతండాలోని ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్‌తో కలిసి విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి సహాయం చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్, కిరణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న నేతలు

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం ముజాహిద్‌పూర్ గ్రామంలో కొన్నిరోజుల క్రితం అనారోగ్య సమస్యలు ఎదుర్కొని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన కటికె రమేష్, విస్లావత్ లలితలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలకృష్ణ, అంబాజీరావు, చంద్రయ్య, తులసీనాయక్, బొడ్యానాయక్, ఉమ్లానాయక్, మెగ్యానాయక్, రాజునాయక్, శ్రీనునాయక్, రాములు, షర్పొద్దీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

తాండూరు రూరల్: ఉపాధ్యాయుల పని తీరు మార్చుకొని.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గుండ్లమడుగుతండా, మైసమ్మతండా, ఉద్దాండపూర్, జినుగుర్తితండా, కోటబాసుపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు సమయ పాలన పాటించాలన్నారు. ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కొంత మంది విద్యార్థులతో బోర్డుపై లెక్కలు రాయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువుల సంత

మర్పల్లి: మర్పల్లి వ్యవసాయ మార్కెట్ షెడ్ ఆవరణలో మంగళవారం నుంచి పశువుల సంత పున:ప్రారంభం చేస్తున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో కరోనాకు ముందు పశువుల సంత కొనసాగేదన్నారు. రైతుల సౌకర్యం కోసం పశువుల సంతను పున:ప్రారంభం చేసేందుకు మార్కెట్ పాలకవర్గం తీర్మానం చేసిందని తెలిపారు. ప్రతి మంగళవారం సంత నిర్వహిస్తామని చెప్పారు. పశువులకు నీడ కోసం షెడ్, నీటి వసతి ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, డైరెక్టర్లు ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి



విద్యార్థిని, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్నారులలో ప్రతిభకు లోటులేదని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ అన్నారు. చౌడాపూర్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని అక్షర రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. సోమవారం ఈ మేరకు జెడ్పీ పాఠశాలలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అలివేలు, నాయకులు సలీం, వెంకటేష్, రాము, రాజు, మణికంఠ, గోపాల్, బాల్‌రాజ్, ప్రభు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన

కొడంగల్ రూరల్: కార్తీక సోమవారం పురస్కరించుకొని మహిళలు ఆలయాలలో భక్తిశ్రద్ధలతో దీపారాధన చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయం, గాడిబాయి శివాలయం, బసవేశ్వర స్వామి ఆలయాలలో మహిళలు దీపాలను వెలిగిస్తూ దీపారాధన చేశారు. ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

పశుపతినాథుని అలంకరణలో..

తాండూరు టౌన్: కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీభావిగి భద్రేశ్వర స్వామి దేవస్థానంలోని శివాలయంలో పరమశివుడు నేపాల్ దేశంలోని పశుపతినాథ్ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

కొడంగల్ రూరల్: రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.విజయకుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ సూచించారు. సోమవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ రైతువేదికలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏ గ్రేడ్ వరి ధాన్యం రూ.2,320, బి గ్రేడ్ రూ.2,300 కొనుగోలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్తా, కొడంగల్ మండల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అంబయ్యగౌడ్, ఏపీఎం వెంకన్న, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

మండల ప్రత్యేకాధికారి సత్తార్



తాండూరు రూరల్: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సత్తార్



తాండూరు టౌన్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అధికారులు సమన్వయంతో పని చేయాలని మండల ప్రత్యేకాధికారి సత్తార్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి తిరిగి ఫార్మాట్‌లో ఉన్న అన్ని అంశాలను నమోదు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంఈఓ వెంకటయ్య, ఎఎస్ఓ శ్రీనివాస్, ఎంపీఓ ఆనంద్‌రావులు ఉన్నారు.

కుటుంబ సర్వేకు సర్వం సిద్ధం

బంట్వారం: సమగ్ర కుటుంబ సర్వేకు సర్వం సిద్ధం చేశామని ఎంపీడీఓ రాములు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉపాధ్యాయులకు సమగ్ర సర్వేపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కులగణన సర్వేకు సంబంధించి 6 నుంచి 9 వరకు ఇంటింటికి వెళ్లి మూడు రోజుల పాటు స్టిక్కర్లు అతికించాలన్నారు. సర్వేపై ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించండి

తాండూరు టౌన్: కులగణన సర్వేను ఎన్యూమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ సూచించారు. సోమవారం పట్టణ కార్యాలయంలో ఉపాధ్యాయులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణనపై ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించాలని దృఢ సంకల్పంతో ఉందన్నారు. ఈనెల 6న ప్రారంభం కానున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, ట్రైనర్ సంగమేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండలంలోని అన్ని నివాస ప్రాంతాల్లో ఈ నెలలో కొనసాగనున్న కులగణన సర్వేను సమగ్రంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలకు సర్వే నిర్వహించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గత నెల 30న సర్వేపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

మర్పల్లి: ఇంటింటి కుల సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, ఎంఈఓ అంజిలయ్య సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి సర్వేపై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీలలో సర్వే చేసేందుకు 90 మంది ఎన్యూమరేటర్లు, 10 మంది సూపర్ వైజర్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణారావు, ఏఓ శ్రీకాంత్, ఏపీఓ అంజిరెడ్డి, ఏపీఎం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమర్థవంతంగా చేయాలి

నవాబుపేట: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో అనురాధ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 10,820 కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రెహమాన్, శిక్షకులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

మండల ప్రత్యేకాధికారి సత్తార్ మాట్లాడిన తర్వాత ఉపాధ్యాయులు ఒక్కసారిగా ఆందోళన చేపట్టారు. తక్కువ కేడర్ ఉన్న వారిని తమపై సూపర్ వైజర్లుగా ఎందుకు వేశారని ప్రశ్నించారు. శిక్షణ వచ్చిన వారికి సర్వేకు సంబంధించి ఫార్మాట్ అందరికీ ఇవ్వాలని తెలియదా అంటూ మండి పడ్డారు. ఎంఈఓ ఎదుటనే ఉపాధ్యాయులు ఆందోళన చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622